మృగశిర సందడి..

చేపలచెరువు వద్ద గుమికూడిన జనం

పాల్వంచలో చేపలు కొనేందుకు బారులు తీరిన ప్రజలు

అన్నపురెడ్డిపల్లి, జూన్ 8: జిల్లా అంతటా మృగశిర కార్తె సందడి కనిపించింది. మృగశిర రోజు చేపలు తింటే వ్యాధులు దరిచేరవని, ఆరోగ్యానికి మేలు జరుగుతుందని నమ్మకంతో ప్రజలు శనివారం చేపలను కొనుగోలు చేయడానికి రావడంతో భారీగా డిమాండ్ పెరిగింది. ఉదయం నుంచే చేపల కోసం చెరువుల వద్ద క్యూ కట్టారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేట టౌన్, జూన్ 8: పట్టణంలోని పెద్దచెరువులో గిరిజనులు చేపల వేట నిర్వహించడంతో చెరువువద్ద జనం భారీగా చేరుకున్నారు. ఈ కార్తెలో చేపలను తినడం ద్వారా ఆస్తమ, శ్వాసకోస వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుందనేది నమ్మకం. ఈ కార్తెలో వర్షాలు ప్రారంభం కావడంతో రైతులు కరీఫ్ సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు.

జోరందుకున్న చేపల అమ్మకాలు

పాల్వంచ, జూన్ 8: పాల్వంచ పట్టణంలో చేపల అమ్మకాలు జోరుగా కొనసాగాయి. పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఉద్యోగులు, ప్రజలు బారులు తీరి మరీ చేపలు కొనుగోలు చేశారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్, మార్కెట్ ఏరియా, కిన్నెరసాని రోడ్, పోస్టాఫీస్ సెంటర్, ఫారెస్టు ఆఫీసర్ రోడ్డు, దమ్మపేట సెంటర్, పాత పాల్వంచ జాతీయ రహదారి పక్కన, ఒడ్డుగూడెం పోయే దారిలో చేపల అమ్మకాలు జోరుగా సాగాయి. మామూలు రోజుల్లో కేజీ రూ.130 నుంచి రూ.150 వరకు ఉండగా, శనివారం మాత్రం కేజీ రూ.200 వరకు పలికినా కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపించారు.

జూలూరుపాడులో...

జూలూరుపాడు, జూన్ 8: మండల కేంద్రంలో రోడ్ల పక్కన చేపలు పోసి విక్రయించడంతో చేపల కోసం జనం బారులు తీరి కనిపించారు. రవ్వలు, కొర్రమేను, బురదమట్ట, వాలుగ, గ్యాస్ కట్ రకాలకు చెందిన చేపలను విక్రయించారు.

చండ్రుగొండలో..

చండ్రుగొండ, జూన్ 8: మండల వ్యాప్తంగా చేపల విక్రయాలు జోరుగా సాగాయి. ఉదయం నుంచే వ్యాపారులు చేపలను తీసుకొచ్చి, గ్రామాల్లోని ప్రధాన సెంటర్ , కూడళ్లల్లో విక్రయాలు చేపట్టారు.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం, జూన్ 8 : మృగశిర రోజున చేపలు తినాలనే నానుడి ఉండడంతో చేపలకు గిరాకీ పెరిగింది. మృగశిర కార్తెలో చేపలు తింటే ఆస్తమా, ఉబ్బసం వంటివ్యాధులు నయం అవుతాయనే నమ్మకంతో ప్రజలంతా భారీగా కొనుగోలు చేశారు. ఇదే అదునుగా సాధారణ ధర కంటే అధిక ధరలకు వ్యాపారులు చేపలను విక్రయించారు. కేజీ రూ.200 ఉండగా మృగశిర కావడంతో రూ.250 నుంచి రూ.300 కేజీ చొప్పున విక్రయించారు.

ప్రధాన సెంటర్‌లో చేపల విక్రయాలు

జల పుష్పాలకు పెరిగిన డిమాండ్

దొంగల ముఠా అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ కరుణాకర్

కొత్తగూడెం క్రైం, జూన్ 8: వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగలను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ముప్పారపు కరుణాకర్ శనివారం ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ నేతృత్వంలో సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తుండగా ఒక కారు అనుమానాస్పదంగా కనిపించింది. కారులో ఉన్న వ్యక్తులను వెంటనే అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు. వీఎం బంజర, పెనుబల్లికి చెందిన గోపి, శ్రీను చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ కాలనీ, చుంచుపల్లిలో నివాసం ఉంటున్నారు. వీరు వీఎం బంజరకు చెందిన ముత్తారావు, శివరాం, కోటయ్య, గద్దల శివ, లక్ష్మణరావుతో ముఠాగా ఏర్పడి వరుస దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందని ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ వెల్లడించారు. భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం ఇళ్ల ముందు ఉన్న ఆటోలు, బైకులు, కార్లను దొంగలించి అమ్ముకుని వచ్చిన సొమ్మును అందరూ పంచుకునేవారని తెలిపారు. కొత్తగూడేనికి చెందిన ఒక ఆటోను అమ్మేందుకు వచ్చిన వీరిని వాహన తనిఖీల్లో భాగంగా పట్టుకున్నట్లు కరుణాకర్ తెలిపారు. దొంగలపై కేసు నమోదు చేసి కోర్టులో రిమాండుకు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో కొత్తగూడెం వన్‌టౌన్ ఎస్సై రవికుమార్, హెడ్ కానిస్టేబుళ్లు గని, రామ్ దాస్, పీసీలు రాజు, ప్రసాద్, డ్రైవర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

10 నుంచి ఆన్‌లైన్ పోర్టల్ ప్రారంభం

కొత్తగూడెం సింగరేణి, జూన్ 8: ఆన్‌లైన్‌లో సాంకేతిక లోపాల వల్ల నిలిచిపోయిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రారంభమవుతుందని జీఎం పర్సనల్ బీఆర్ దీక్షితులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఈఅండ్ఎం), మేనేజ్‌మెంట్ ట్రైనీ (సిస్టమ్స్), జేఎంఈటీ, అసిస్టెంట్ ఫోర్ మెన్ ట్రైనీ (ఎలక్ట్రికల్), అసిస్టెంట్ ఫోర్ మెన్ ట్రైనీ (మెకానికల్), ఫిట్టర్ ట్రైనీ, ఎలక్ట్రీషియన్ ట్రైనీ ఉద్యోగాలలో ఖాళీలు భర్తీ చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 29వ తేదీ వరకు గడువు పొడిగించామని, అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కొత్తగూడెం అర్బన్, జూన్ 8: మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు న్యూ గొల్లగూడెం ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న పనులను కౌన్సిలర్ మాచర్ల రాజకుమారి శనివారం పరిశీలించారు. తరగతి గదులు శుభ్రం చేయించాలని, పెయింటింగ్, టాయిలెట్స్ పనులను పరిశీలించి హెచ్ఎం జరీనాతో మాట్లాడారు. టీచర్లు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

రైతులందరి క్షేమం కోసం దీక్ష

భద్రాచలం, జూన్ 8 : నృసింహ సేవా వాహిని వ్యవస్థాపకులు, అహోబిల మఠం అర్చకులు డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి రైతులు క్షేమంగా ఉండాలని దీక్ష చేపట్టారు. అందులో భాగంగా మృగశిర కార్తె రోజున పలు దివ్యక్షేత్రాల నుంచి మట్టి సేకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించి, రైతులకు ఏరువాక పౌర్ణమి రోజు అందించి వారికి పంటలు పండాలని ఆశీర్వదించి పంపుతున్నారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. ఈ ఏడాది రైతులకు ఈ దివ్య ప్రసాదాన్ని అందించాలని అనుకున్నామన్నారు. రైతులందరూ తమ కుటుంబాలతో సుభిక్షంగా ఉండాలనే సత్సంకల్పంతో, రైతు కు మంచి రోజులు రావాలని, రైతే రాజు అన్న నినాదం నిజం కావాలని మహత్తర కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో శ్రీధర్ శర్మ అర్చకులు, నృసింహ సేవా వాహిని సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచాలి

కొత్తగూడెం అర్బన్, జూన్ 8: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో వంగా రవిశంకర్, సందెల సందీప్, తాటిపాముల హరికృష్ణ, సమీర్, మురళీ పాల్గొన్నారు.

మల్లాయిగూడెంలో హరితహారం

మల్లాయిగూడెంలో మొక్కలు నాటుతున్న ఉపాధి కూలీలు

అశ్వారావుపేట రూరల్, జూలై 8: మండల పరిధిలోని మల్లాయిగూడెం గ్రామ పంచాయతీలో శనివారం హరితహారం నిర్వహించారు. ఉపాధి కూలీలు రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. గ్రామ పంచాయతీ నర్సరీలో పెంచిన మొక్కలను మల్లాయిగూడెం నుంచి కొండతోగు రహదారిలో ఇరువైపులా సుమారు 400 పైగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ , పీసా కార్యదర్శి కొర్రి మల్లయ్య, గుమస్తా మంగరాజు పాల్గొన్నారు.

నిరుపేద మహిళలకు గొడుగుల పంపిణీ

బూర్గంపాడు, జూన్ 8: ఐటీసీ అనుబంధ సేవా సంస్థ అయిన రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా సారపాక ఆధ్వర్యంలో చిరువ్యాపారులకు గొడుగులను అందించారు. రోటరీ యూనిట్ హెడ్ ప్రణవ్ షర్మ, రోటరీ ప్రెసిడెంట్ జయంత్‌కుమార్, డీవీఎం నాయకుడు, శ్రీకాంత్‌రెడ్డి, కునిశెట్టి రాంబాబు, యేసోబు, సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, ప్రతాప్, ఎంఎస్‌కే ఎన్‌జీవో అధికారులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ చదువుకోవాలి

బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

బూర్గంపాడు, జూన్ 8: నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే చదువుకోవాలని పాఠశాల హెచ్ఎం ఆదినారాయణ అన్నారు. శనివారం మోరంపల్లి బంజర గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామ పురవీధుల్లో గ్రామ పెద్దలు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపించే విధంగా చొరవ చూపాలని అన్నారు. ఉపాధ్యాయులు రవి, ఉమా, సుజాత, రమ, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శిరోమణి, ఉపాధ్యాయులు శంకర్, పద్మ, కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు కృపావేణి, పద్మ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ చేతుల నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనులు ప్రారంభం

చండ్రుగొండ, జూన్ 8: మండల వ్యాప్తంగా వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రధానంగా పత్తి విత్తనాలు నాటేందుకు అన్నదాతలు అరక పనులను చేపడుతున్నారు. తిప్పనపల్లి, తుంగారం, రేపల్లెవాడ, గానుగపాడు, పోకలగూడెం, బెండాలపాడు, రావికంపాడు గ్రామాల్లో వ్యవసాయ పనులు కొనసాగుతున్నాయి. గ్రామాల్లో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

దుమ్ముగూడెం, జూన్ 8 : మండల కేంద్రానికి చెందిన బైరెడ్డి భాను కిరణ్ అనే వ్యక్తి తన భార్యతో కలిసి పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో రాత్రి సమయంలో బైరెడ్డి భానుకిరణ్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రెండు బీరువాల తాళాలు పగులగొట్టి అందులో ఉన్న సుమారు 59 గ్రాముల బంగారు వస్తువులు, 30 తులాల వెండి, రూ.50 వేలు నగదును దొంగిలించారు. మొత్తం రూ.2,37,000 ఉంటుందని బాధితులు తెలిపారు. భానుకిరణ్ హైదరాబాద్‌లో ఉండడం వల్ల అతని బంధువైన గొల్లపల్లి నిర్మల అనే మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పత్రికా రంగంలో అస్తమించని సూర్యుడు రామోజీరావు

రామోజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్, ఇతర రాజకీయ నాయకులు, ప్రెస్‌క్లబ్ బాధ్యులు

భద్రాచలం, జూన్ 8 : పత్రికా ప్రపంచంలో ఎప్పటి అస్తమించని సూర్యుడు రామోజీరావు అని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి ప్రసాద్‌బాబు, మాగంటి రమేశ్‌బాబు అన్నారు. శనివారం లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల ప్రాంగణంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రామోజీకి ఘన నివాళి

అశ్వారావుపేట, జూన్ 8: సామాన్య కుటుంబంలో పుట్టిన రామోజీరావు ఒక వ్యవస్థ నిర్మాణానికి మార్గదర్శులుగా నిలిచారని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశ్‌రావు, వివిధ పార్టీల నాయకులు చిన్నంశెట్టి సత్యనారాయణ, శీమకుర్తి శ్రీనివాసరావు, తుమ్మా రాంబాబు, కొక్కెరపాటి పుల్లయ్య, సయ్యద్ సలీమ్, ప్రెస్‌క్లబ్ బాధ్యులు పాశం రామారావు పేర్కొన్నారు. స్థానిక పాత ఎండీపీవో కార్యాలయ ప్రాంగణంలో శనివారం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో రామోజీరావుకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అవగాహనతో ప్రమాదాలు నివారించవచ్చు

మాట్లాడుతున్న జీఎం జాన్ ఆనంద్

టేకులపల్లి, జూన్ 8: సింగరేణి ఉపరితల గనుల్లో ఉద్యోగులు అవగాహనతో ప్రమాదాలను నివారించవచ్చని ఇల్లెందు ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ అన్నారు. శనివారం మండలంలోని కోయగూడెం ఉపరితల గనిలో సింగరేణి కార్పొరేట్ జీఎం (సేఫ్టీ) గురవయ్య ఆదేశాలతో కేవోసీ పీవో వి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉద్యోగులకు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం జాన్ ఆనంద్ మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలతో ఎటువంటి ప్రమాదాలు లేని జూన్ నెలను సాధించగలిగామని అన్నారు. కేవోసీ ప్రాజెక్టు ఆఫీసర్ వి.శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ రాజు, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, సూర్యనారాయణ, రాజు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరిస్తాం

మాట్లాడుతున్న ఏడీఈ వేణు

దుమ్ముగూడెం, జూన్ 8 : రైతులకు త్రీఫేస్ విద్యుత్ సమస్యను పరిష్కరిస్తామని దుమ్ముగూడెం ఏడీఈ తెలప్రోలు వేణు అన్నారు. మండలంలోని ధర్మాపురం, రేగుంట గ్రామాల్లో శనివారం సబ్ ఇంజినీర్ రాజేశ్‌తో కలిసి ఆయన పర్యటించి రైతులతో మాట్లాడారు. త్వరలోనే త్రీఫేస్ సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. వారి వెంట వీరమాచినేని వినిల్, కాకా వెంకటేశ్వర్లు, ధర్మాపురం, రేగుంట రైతులు ఉన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంత్రి తుమ్మలకు సమస్యలను విన్నవిస్తున్న కమర్తపు మురళి

ఖమ్మం, జూన్ 8 : తెలంగాణలో ఉన్న చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి, చేనేత సహకార సంఘాల నాయకులు శనివారం హైదరాబాద్‌లో గల సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ చేనేత సహకార సంఘాల్లోని వస్త్ర నిలువలను ఖరీదు చేయాలని, ఇప్పటివరకు ఉన్న బకాయిలను త్వరితగతిన చెల్లించాలని నేతన్న బీమా, పావలావడ్డీ, జీఎస్‌టీ బకాయిలు త్వరితగతిన చెల్లించాలని కోరారు. అంతేకాకుండా క్యాష్ క్రెడిట్, చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాలు మాఫీ చేయాలని, 65 సంవత్సరాల్లోపు మృతిచెందిన చేనేత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా 5 లక్షల బీమా చెల్లించాలని మంత్రి తుమ్మలను కోరారు. మంత్రి మాట్లాడుతూ చేనేత కార్మికులకు దీర్ఘకాలిక లబ్ధి చేకూర్చే పథకాల కోసం చర్యలు తీసుకుంటున్నామని, చేనేత కార్మికులకు 365 రోజులు చేతినిండా పని కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

రిజర్వేషన్ సాధన కోసం ఉద్యమిద్దాం..

నినాదాలు చేస్తున్న నాయకులు

కొత్తగూడెం అర్బన్, జూన్ 8: ఆలిండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమిద్దామని వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో శనివారం ఆలిండియా బంజారా సేవాసంఘ్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. గిరిజన రిజర్వేషన్లను అమలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలతో పాటు రిలే దీక్షలు, మిలిటెంట్ పోరాటాలకు సిద్ధంగా ఉన్నామన్నారు. జోగురాం, ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, హాతీరాం నాయక్, బస్కి నాయక్, రమేష్, నాగేశ్వరరావు, లక్ష్మణ్, బాలు, సర్కార్, హరి, రాందాస్, మోహన్, మంగీలాల్ నాయక్, నాగేంద్ర పాల్గొన్నారు.

రామయ్యసేవలో ఏపీ హైకోర్టు జడ్జి

రామయ్యను దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి

భద్రాచలం, జూన్ 8 : భద్రాచలం సీతారామచంద్రస్వామివారిని శనివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి టి మల్లికార్జున రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్థంభం వద్ద నమస్కరించుకొని అంతరాలయంలోని మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న ఉపాలయాలను సందర్శించి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు ఆయనకు లక్ష్మి తాయారమ్మవారి సన్నిధిలో వేదాశీర్వచనం, స్వామివారి ప్రసాదాలు, స్వామివారి శేష వస్త్రాలు అందజేశారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

మాట్లాడుతున్న జడ్జి సూరిరెడ్డి

మణుగూరు టౌన్, జూలై 8: రాజీయే రాజ మార్గమని, ఏండ్ల తరబడి కాలయాపన చేయకుండా ఇరు వర్గాల వారు రాజీ చేసుకోవాలని మణుగూరు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కంబపు సూరిరెడ్డి అన్నారు. శనివారం మణుగూరు కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో పలు కేసులు రాజీ కుదుర్చుకున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం ఒక్కరోజు 245 కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించడంతో పాటు పలు పిట్టీ కేసులు 373 కేసులు పరిష్కరించి పలు కేసులకు రూ.2,64,950 జరిమానా విధించినట్లు వివరించారు.

ఎమ్మార్పీఎస్ కవాతును జయప్రదం చేయండి

భద్రాచలం, జూన్ 8 : వచ్చే నెల 7న వరంగల్‌లో జరిగే ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే ఆత్మ గౌరవ కవాతును జయప్రదం చేయాలని ఎంఎంఎస్ (మహజన మహిళా సమాఖ్య) జిల్లా అధ్యక్షురాలు మేకల లత పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీలో ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకునేందుకు ప్రజా పోరాటానికి అందరం సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ జిల్లా అధికార ప్రతినిధి తెల్లం సమ్మక్క, జిల్లా ఉపాధ్యక్షురాలు కంచర్ల కుమారి, కొప్పుల నాగమణి, రహిమా, నిర్మలమ్మ, బుర్ర నాగలక్ష్మి పాల్గొన్నారు.

బాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి, జూన్ 8: మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. శనివారం ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పురోహితుడు ప్రసాదాచార్యులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా స్వామి వారి కల్యాణం జరిపించారు. భక్తులు ఆలయంలో పూజలు చేసి, కల్యాణం తిలకించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ మేనేజర్ వెంకటరమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ట్రైబల్ ఫోరం సభను జయప్రదం చేయండి

గుండాల, జూన్ 8: జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగే అఖిల భారత ట్రైబల్ ఫోరం సదస్సును జయప్రదం చేయాలని ఆదివాసీ నాయకులు కోరారు. మండలం పరిధిలోని శెట్టుపల్లి గ్రామంలోని అల్లూరి సీతారామరాజు సెంటర్‌లో ఆదివాసీ నాయకులు బచ్చల సారయ్య, ఇర్ప భూమయ్య శనివారం పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం ఆదివాసీలపై ఉక్కుపాదం మోపుతుందని, పీసా చట్టాలను నిర్వీర్యం చేస్తూ , 1/70 చట్టాలను తుంగలో తొక్కుతుందన్నారు. ఫోరం సదస్సుకు అధిక సంఖ్యలో ఉద్యోగులు, యువత, ఆదివాసీ నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఇర్ప మోజేష్, కల్తి మల్లయ్య, పెనక సూర్యం, కల్తి సురేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కాలేజ్
2024 ఇంటర్ ఫలితాలలో రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి మార్కులతో అపూర్వ విజయం... అద్భుత సంచలనం... లిటిల్‌ఫ్లవర్స్ కే సాధ్యం..!
Intermediate 2nd Year -2024
STATE TOP MARKS 989 Suhana Afza H.T.No.2444203388 MPC
STATE TOP MARKS 988 V.Pravalika H.T.No.2444203303 MPC
STATE TOP MARKS 986 Md.Shama Ara H.T.No.2444202802 BiPC
MPC, BIPC, CEC, HEC, MEC E/M & T/M
అడ్మిషన్లు జరుగుచున్నవి
మెడికల్ కాలనీ, భద్రాచలం
Cell : 9866810122, 9121183410

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **పాల్వంచ బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **వరికూడి వెంకటసుబ్బారావు** S/o : **వరికూడి వీరస్వామి** వయస్సు : 54సం||లు, వృత్తి : కాంట్రాక్టర్, నివాసం : ఇ.నెం. 20-5-120, కాంట్రాక్టర్స్ కాలనీ, పాల్వంచ గ్రామం మరియు మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంటులు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 5 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి: జిల్లా రిజిస్ట్రారు ఖమ్మం, సబ్ రిజిస్ట్రారు వారి ఇలాఖా కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ మండలం, పాల్వంచ మున్సిపల్ పరిధిలో చేరిన పాల్వంచ పట్టణ గట్టాయిగూడెం యందు నేను మీకు విక్రయించి సర్వే నెం. 665 మిం.లే., ఖాళీ నివేశన స్థల ప్లాటు నెంబర్ : 28, **డాక్యుమెంట్ నెం. 5588/2019**, గల దానికి కొలతలు తూర్పు నుండి పడమర 30అడుగులు, ఉత్తరం నుండి దక్షిణము : 40 అడుగులు మొత్తం వైశాల్యం 133.33 చ||గ||/111.99 చ||మీ|| సదరు ఆస్తికి హద్దులు : **తూర్పు** : నాగేశ్వరరావు గారి స్థలము, **పడమర** : రమణమూర్తి గారి బిల్డింగ్, (8-2-148/1), **ఉత్తరం** : 30 అడుగుల వెడల్పు గల రోడ్, **దక్షిణము** : వారాల వెంకటేశ్వరరావు గారి స్థలము.

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, కొత్తగూడెం.సెల్ : 9849246278

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

కేశప్పగూడెం మాజీ సర్పంచ్ మృతి

అశ్వారావుపేట రూరల్, జూన్ 8: మండల పరిధిలోని కేశప్పగూడెం మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు కొమరం బాబురావు (47) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. కేశప్పగూడెం కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పడి తొలిసారి జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి కొమరం బాబురావు సర్పంచ్‌గా పోటీ చేసి విజయం సాధించారు. గత ఏడాది బాబురావు భార్య ఆదిలక్ష్మి మృతిచెందింది. నాటి నుంచి అనారోగ్యానికి గురై శనివారం మృతిచెందాడు. బాబురావుకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జూలూరుపాడు, జూన్ 8: మండల పరిధిలోని జడలచింత గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పాపకొల్లు గ్రామానికి చెందిన ప్రసాద్ తన ద్విచక్రవాహనంపై జూలూరుపాడు వెళ్తుండగా జడలచింత గ్రామానికి చెందిన వంశీ తన ద్విచకవాహనంపై పాపకొల్లు వెళ్తుండగా మూలమలుపు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు కావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి ప్రమాద వివరాలు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్ నాయకుడు మృతి

నివాళి అర్పించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా


నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

ములకలపల్లి, జూన్ 8: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు పాలకుర్తి ప్రసాద్ (55) గుండెపోటుతో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళి అర్పించిన వారిలో జడ్పీటీసీ సున్నం నాగమణి, దమ్మపేట జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, పామర్తి వెంకటేశ్వరరావు, చెన్నయ్య, మాస్టర కృష్ణ, సూరం పుల్లారావు, దానియాలు రాజు, గుడిపటి సురేశ్, ఒలేటి నరసింహారావు, తుర్రం శ్రీను, కొసరి వెంకటేశ్వర్లు, దుర్గ ప్రసాద్, కొసరి లక్ష్మణ్‌రావు, దేవసాని తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అశ్వారావుపేట, జూన్ 8: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పోలీసుల పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వినాయకపురం వద్ద పెట్రోలింగ్ చేస్తున్న సిబ్బంది నారాయణపురం నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను తనిఖీ చేశారు. ఎటువంటి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ మోజేస్, యజమాని నాగరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై యాకూబ్ అలీ తెలిపారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

కరకగూడెం, జూన్ 8: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని చొప్పాల గ్రామానికి చెందిన ఏడుళ్ల సమ్మయ్యకు చెందిన దుక్కిటెద్దు మేతకు వెళ్లి వస్తున్న క్రమంలో శ్రీరంగాపురం గ్రామ శివారున తెగిపడి ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలకు తగలడంతో అక్కడికక్కడే మృత్యువాత పడింది. దీని విలువ సుమారు రూ.50 వేల రూపాయలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.